www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 56 | | 5-8-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-


## ఈ20 పెట్రోల్‌తో బహుళ ప్రయోజనాలు




- రైతులకు లాభం, దిగుమతులకు చెక్!
- కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణ పరిరక్షణకు ఊతం
- పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టత!

4

## నీట్ ఉద్యమం మళ్లీ భగ్గుమంది!



- బిహార్‌లో విద్యార్థుల మరోసారి భారీ ఆందోళన
- ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి యత్నం..
- వాటర్ కేనన్లతో చెదరగొట్టిన పోలీసులు

2

## ఒప్పందమా.. లొంగుబాటా!

- ఇరాన్‌కు ట్రంప్ తుది హెచ్చరిక
- చర్చలకు రాకుంటే కఠిన చర్యలేనన్న అమెరికా అధ్యక్షుడు
- టెహ్రాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయ వ్యూహాలపై దృష్టి
- హోర్ముజ్ జలసంధిపై అమెరికా ఆధిపత్యమంటూ వ్యాఖ్యలు



4

# పోలీస్ నియామకాల్లో కుట్రలకు చెక్!

### 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష

- ప్రశ్నపత్రాల నుంచి ఫలితాల వరకు పూర్తి పారదర్శకతకు ఆదేశాలు
- దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా




తెలంగాణలో పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను తీవ్రంగా ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియను భంగపరచేందుకు కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర స్వార్థ శక్తులు కుట్రలు పన్నుతున్నట్లు నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్, సీనియర్ అధికారులతో సీఎం సచివాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు.

వివరాలు 2వ పేజీలో..



# కల్తీ మసాలాల గుట్టురట్టు!


- 13 సంస్థలపై హెచ్-ఫాస్ట్ మెరుపుదాడులు
- 25 టన్నుల కల్తీ మసాలాలు.. 89 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- క్యాన్సర్ కారక రసాయనాల వినియోగం..
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి

...వివరాలు 2వ పేజీలో

## అంబులెన్స్ సిబ్బంది దాష్టీకం

- మృతదేహాన్ని మార్గమధ్యలో వాహనాన్ని అడ్డగించి వాగ్వాదం
- 'మా అంబులెన్స్‌లోనే తీసుకెళ్లాలి' అంటూ పట్టుబట్టిన సిబ్బంది
- బాధిత కుటుంబం ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి

2




## 'వర్షాలు పడొద్దని క్షుద్ర పూజలు!'

- హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు
- 'ఆధారాలు మా వద్ద ఉన్నాయి.. ప్రజలకు నిజాలు చెప్పాలి' డిమాండ్

3



## చురుగ్గా నైరుతి

- రాష్ట్రానికి ఎల్లో అలర్ట్..!
- హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం
- ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సూచనలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

2



## గాలిలో దీపంలా వైద్య విధాన పరిషత్

- అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు
- ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు
- కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్
- సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

3



## కాళేశ్వరం ప్రాముఖ్యత మరోసారి రుజువైంది

- ఎస్సారెస్పీకి గోదావరి జలాల ఎత్తిపోతలపై కేటీఆర్ హర్షం
- 'కాంగ్రెస్ ప్రచారాన్ని నీరే ఖండిస్తోంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్యలు

3




## కేసు నమోదు చేస్తే అధికారుల బదిలీ ఎందుకు?

- 'మోదీపై పోస్టులకు కేసు పెడితే శిక్ష.. రాహుల్‌పై అయితే వదిలేస్తారా?'
- డీసీపీ ఆనంద్‌బాబు బదిలీపై సీఎంను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి




3

## నిమ్స్‌లో యువతిపై అసభ్య ప్రవర్తన!

- చికిత్స పొందుతున్న బాధితురాలిని వేధించిన అటెండర్
- బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

2



ఉద్యమ కెరటం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# నిమ్స్‌లో యువతిపై అసభ్య ప్రవర్తన..!

**చికిత్స పొందుతున్న బాధితురాలిని వేధించిన అటెండర్**

**బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు**

**నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**

**హైదరాబాద్, ఆగస్టు 4:** నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిపై ఓ రోగి అటెండర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో బాధిత యు-వతిని కుటుంబ సభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల మధ్య పక్క బెడ్‌లో ఉన్న మరో రోగి అటెండర్ యువతిపై అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన యువతి, మరుసటి రోజు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వెల్లడించింది. అనంతరం యువతి తండ్రి, ఆర్ఎంపీ వైద్యుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితుడి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# చురుగ్గా నైరుతి..

## రాష్ట్రానికి ఎల్లో అలర్ట్..!

**హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం**

**ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సూచనలు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**



**హైదరాబాద్, ఆగస్టు 4:** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో తెలంగాణలో మళ్లీ వర్షాలు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా క్యుములో నింబస్ మేఘాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో కురిసిన వర్షాలు సాధారణ జనజీవనాన్ని ప్రభావితం చేశాయి. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని వాతావరణ శాఖ సూచించింది. స్థానిక పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది.

# మృతదేహం తరలింపుపై అంబులెన్స్ సిబ్బంది దౌర్జన్యం!

**మార్గమధ్యలో వాహనాన్ని అడ్డగించి వాగ్వాదం**

**బాధిత కుటుంబం ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి**

**మంచిర్యాల, ఆగస్టు 4:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో మృతదేహం తరలింపు విషయంలో అంబులెన్స్ సిబ్బంది వ్యవహరించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇంటికి తీసుకెళ్తున్న మృతదేహాన్ని మార్గమధ్యలో అడ్డగించి, తమ అంబులెన్స్‌లోనే తరలించాలని ఒత్తిడి తెచ్చిన ఘటన బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం, పట్టణంలోని పి.ఆర్. శంకరయ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెలగపూడి నాగభూషణం(65) సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికంగా అందుబాటులో ఉన్న అంబులెన్స్‌లో వసుధ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు మరో అంబులెన్స్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా ఆస్పత్రి వద్ద ఉన్న అంబులెన్స్ సిబ్బంది వాహనాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. "ఇక్కడ అంబులెన్స్ పాయింట్ మాది.. మా వాహనంలోనే మృతదేహాన్ని తీసుకెళ్లాలి" అంటూ వాగ్వాదానికి దిగారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే బయలుదేరిన అంబులెన్స్‌ను బలవంతంగా తిరిగి ఆస్పత్రికి రప్పించి, తమ అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని తరలించినట్లు బాధితులు ఆరోపించారు. "ఇక్కడ మేమే సీనియర్లం.. మేము చెప్పిందే నడవాలి" అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న సమయంలో ఇలాంటి ఘటన జరగడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# పోలీస్ నియామకాల్లో కుట్రలకు చెక్!

- 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై సీఎం రేవంత్ అత్యవసర సమీక్ష
- ప్రశ్నపత్రాల నుంచి ఫలితాల వరకు పూర్తి పారదర్శకతకు ఆదేశాలు
- దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా



**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోలీస్ పోస్టుల భర్తీ ప్రక్రియకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర స్వార్థపూరిత శక్తులు నియామక ప్రక్రియను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని నిఘా వర్గాలు నివేదించడంతో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియలన్నింటిలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోచింగ్ సెంటర్ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నియామక పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియా, ఇతర వేదికల ద్వారా వ్యాప్తి చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సీఎం ఆదేశించారు. పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

# గాలిలో దీపంలా వైద్య విధాన పరిషత్

**ప్రత్యేక వైద్య సేవలు దెబ్బతింటున్నాయన్న హరీశ్‌రావు**

**పూర్తిస్థాయి కమిషనర్ లేక 184 ఆస్పత్రులు అగమ్యగోచరమని విమర్శ**



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పూర్తిస్థాయి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారిందని ఆరోపించారు. మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన హరీశ్‌రావు.. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో పరిషత్ పరిధిలోని మాతా–శిశు ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు కలిపి మొత్తం 184 ప్రభుత్వ ఆస్పత్రుల పరిపాలన దెబ్బతిందన్నారు. ఆస్పత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యత, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత వంటి అంశాలను పర్యవేక్షించే యంత్రాంగమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు ప్రజలు నాణ్యమైన వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైద్య సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలు, ఇతర పరిపాలనా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వ హయాంలో వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించామని గుర్తు చేశారు. అయితే మూడేళ్లు గడిచినా సేవా నిబంధనలు రూపొందించకపోవడం, విలీన ప్రక్రియను పూర్తి చేయకపోవడం వల్ల వైద్యులు, ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, రోడ్డెక్కి నిరసనలు తెలిపినా స్పందన లేదని విమర్శించారు. వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని ఆయన డిమాండ్ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి సేవా నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించాలని, పూర్తిస్థాయి అధికారిని వెంటనే నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు కోరారు.

# కేసు నమోదు చేస్తే అధికారుల బదిలీ ఎందుకు?

- 'మోదీపై పోస్టులకు కేసు పెడితే శిక్ష.. రాహుల్‌పై అయితే వదిలేస్తారా?'
- డీసీపీ ఆనంద్‌బాబు బదిలీపై సీఎంను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అభ్యంతరకర పోస్టులు చేసిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కేనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అలాంటి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్‌బాబును తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. చట్టప్రకారం విధులు నిర్వహించిన అధికారిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శిక్షించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ సూచనల మేరకే డీసీపీని బదిలీ చేశారని విమర్శించారు. చట్టాన్ని అమలు చేసే అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఆందోళనకరమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్.. తెలంగాణలో మాత్రం చట్టపరంగా కేసులు నమోదు చేసిన అధికారులనే శిక్షిస్తోందని అన్నారు. రాహుల్ గాంధీపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తుందా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా సింగరేణికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నైనీ, తాడిచర్ల–2, మణుగూరు బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించినట్లు తెలిపారు. మణుగూరు బ్లాక్ కోసం పలువురు పోటీ పడినా, సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం



కేటాయింపు నిర్ణయం తీసుకుందని చెప్పారు. కొత్త బొగ్గు బ్లాక్‌లతో సింగరేణికి దీర్ఘకాలిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు సింగరేణి ప్రయోజనాలను దెబ్బతీశాయని ఆరోపించిన కిషన్‌రెడ్డి.. కేంద్ర ప్రభుత్వం మాత్రం సంస్థ అభివృద్ధి, విస్తరణకు కట్టుబడి ఉందని అన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ మసాలాల గుట్టురట్టు..!

- 13 సంస్థలపై హెచ్-ఫాస్ట్ మెరుపుదాడులు
- 25 టన్నుల కల్తీ మసాలాలు.. 89 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- క్యాన్సర్ కారక రసాయనాల వినియోగం..
- కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్ -ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ–ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# విద్యారంగ సమస్యలపై దశలవారీ పోరాటం

- 7న నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసనలు
- 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు
- ఉపాధ్యాయ సంఘాల జేపీసీ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహించాలని యూఎస్‌పీసీ నిర్ణయించింది. ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, పీఆర్‌సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండం, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యాయులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యా రంగానికి 15శాతం నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీ కే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఈవో, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీవో 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్ లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (ఆం), పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ప్రతినెలా రూ. 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలుకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చావ రవి, ఏ వెంకట్(టీఎస్ యూటీఎఫ్), సీహెచ్ అనీల్ కుమార్, ఎన్ తిరుపతి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టీ లింగారెడ్డి(డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టీఎఫ్), ఎస్ హరికిషన్ (టీటీఏ), బీ కొండయ్య (ఎంఎస్‌టీఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ, ఎస్టీ యూఎస్) పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి విద్యే పునాది

- విద్యార్థుల్లో నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- వీసీల సమావేశంలో ఉన్నత విద్యాభివృద్ధిపై దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి విద్యే కీలకమని రాష్ట్ర గవర్నర్, తెలంగాణ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం బోధనకే పరిమితం కాకుండా సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం రాజ్‌భవన్‌లో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్), నషా ముక్త్ యువ వికసిత్ భారత్, మై భారత్ పోర్టల్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల కార్యకలాపాలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. దేశ మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలంటే యువతకు విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలకు విశ్వవిద్యాలయాలు తమ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. సమావేశంలో పలువురు వైస్ ఛాన్సలర్లు మాట్లాడుతూ.. మొదటి తరం విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, హెచ్ఐవీ నివారణ, రక్తదాన ప్రోత్సాహం, జీవన నైపుణ్యాల పెంపొందింపులో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, రాజ్‌భవన్‌తో సమన్వయంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఉన్నత విద్యారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.





# సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

**బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చర్యలు**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్టర్ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణెళి ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



# వర్షాలు పడొద్దని క్షుద్ర పూజలు!

**హరీశ్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు**

**'ఆధారాలు మా వద్ద ఉన్నాయి.. ప్రజలకు నిజాలు చెప్పాలి' డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్ట్ 4:** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకుండా, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంటూ మాజీ మంత్రి తనపై వస్తున్న ఆరోపణలకు ప్రజల ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్.. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని, ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని కోరారు. తిరుపతి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవాలయాల్లో ప్రార్థనలు చేయడం సహజమేనని, కానీ ప్రజలకు కీడు జరగాలని కోరుతూ క్షుద్ర పూజలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మహేశ్ గౌడ్ విమర్శించారు. రాజకీయ స్వార్థం కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌కు లీగల్ నోటీసులు పంపించారని పేర్కొన్న ఆయన, అలాంటి నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అఘోరులతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం జరిగిందని, ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలు ఆ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టి ఏమి చేశారో ప్రజలకు వెల్లడించాలని హరీశ్ రావును డిమాండ్ చేసిన మహేశ్ గౌడ్.. మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలను సమాజం సమర్థించదని అన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఆచారాలను ఇప్పటికీ నమ్ముతున్నప్పటికీ, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

# టీపీసీసీ చీఫ్‌కు హరీశ్ లీగల్ నోటీసు

**క్షుద్ర పూజల ఆరోపణలు వెనకితీసుకొని**

**బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 4 :** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు లీగల్ నోటీసులు పంపారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు నిర్వహించారని మహేశ్ చేసిన వ్యాఖ్యలు పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని పేరొంటూ తన న్యాయవాది ద్వారా నోటీసులిచ్చారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవి తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠకు నష్టం కలిగించే ఉద్దేశంతో చేసినవేనని పేరొన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు కాంగ్రెస్ నాయకుల మానసిక అసమతుల్యతకు నిదర్శనమని హరీశ్ తరఫు న్యాయవాది వ్యాఖ్యానించారు. మహేశ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనకి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేకపోతే పరువు నష్టం దావా వేస్తామని న్యాయవాది స్పష్టం చేశారు.

# కాళేశ్వరం ప్రాముఖ్యత మరోసారి రుజువైంది

**ఎస్సారెస్పీకి గోదావరి జలాల ఎత్తిపోతలపై కేటీఆర్ హర్షం**

**'కాంగ్రెస్ ప్రచారాన్ని నీరే ఖండిస్తోంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 4:** ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలను రివర్స్ పంపింగ్ ద్వారా ఎత్తిపోస్తుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు ఈ పరిణామం సమాధానమని, ప్రాజెక్టు ప్రాముఖ్యత మరోసారి రుజువైందని పేర్కొన్నారు. మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి శ్రీరాంసాగర్ వరద కాలువకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆరోపణలు, దుష్ప్రచారాలు చేసినా రైతులు తమ పొలాలకు చేరుతున్న నీటినే చూస్తున్నారని, వాస్తవాలు వారికి బాగా తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు చేరుతున్న దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ కాంగ్రెస్ విమర్శలను ఆయన తిప్పికొట్టారు.

ఉద్యమ కెరటం
విజయం ఉద్యమ లక్ష్యం UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
5 ఆగస్టు 2026

## సంపాదకీయం



# బీజేపీ ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

**కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కీలక దశకు చేరుకుంది. ప్రస్తుతం పార్టీ, ప్రభుత్వం రెండింటి నిర్ణయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలదే కీలక పాత్ర. కాబట్టి వారు పరిస్థితులను సకాలంలో అంచనా వేయడం అవసరం. ఎందుకంటే దేశంలో పాలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అసంతృప్తి క్రమంగా పెరుగుతోందనే సంకేతాలు ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సూచిస్తున్నాయి.**

ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది. మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం గుజరాత్‌లో మాత్రమే విజయాన్ని నమోదు చేయగా, అధికారంలో ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో పరాజయం పాలైంది. సాధారణంగా అధికార పార్టీలకు ఉప ఎన్నికల్లో అనుకూల వాతావరణం ఉంటుందనే రాజకీయ సూత్రానికి భిన్నంగా వచ్చిన ఈ ఫలితాలు ప్రజాభిప్రాయంలో మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇక నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విద్యార్థుల నిరసనలు, పార్లమెంట్ ముట్టడి వంటి పరిణామాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని కేవలం రాజకీయ పరిణామంగా కాకుండా, విద్యా వ్యవస్థపై యువతలో పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిబింబంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ప్రారంభంలో ఈ ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోని ప్రధాన స్రవంతి మీడియా కూడా చివరకు దాని ప్రాధాన్యాన్ని గుర్తించాల్సి వచ్చింది. చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, విద్యార్థి ఉద్యమాలను ఏ ప్రభుత్వం తేలికగా తీసుకున్నా దాని రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో జరిగిన ప్రజా ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు యువత పోషించిన పాత్ర కీలకమైనది. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత ఆకాంక్షలు, ఆవేదనలను విస్మరించడం ఏ ప్రభుత్వానికీ శ్రేయస్కరం కాదు.

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 242 సీట్లకే పరిమితం కావడం కూడా ప్రజలు ఇచ్చిన ఒక హెచ్చరికగానే విశ్లేషించాలి. తాజాగా ఉప ఎన్నికల ఫలితాలు ఆ హెచ్చరికను మరింత బలపరిచినట్లు కనిపిస్తున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పెరుగుతున్న పన్నుల భారం, విద్యా, వైద్య రంగాల్లో సామాన్యులకు పెరుగుతున్న ఆర్థిక భారాలు ప్రజల్లో అసంతృప్తికి కారణాలుగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నిక ప్రత్యేక రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విజయం కేవలం ఒక నియోజకవర్గ ఫలితం మాత్రమే కాదు, బీజేపీకి బలమైన రాజకీయ హెచ్చరికగా కూడా పలువురు విశ్లేషిస్తున్నారు. దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానంలో పరాజయం ఎదురుకావడం, ముఖ్యంగా అగ్రవర్ణ ఓటర్ల ప్రాబల్యం ఉన్న నియోజకవర్గంలో ఈ ఫలితం రావడం పార్టీకి ఆలోచన కలిగించే అంశం. నీట్ వివాదం, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగ సమస్య, ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలు యువత ఓటింగ్ ధోరణిపై ప్రభావం చూపినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. యువతతో పాటు మధ్యతరగతి, వృద్ధులు కూడా మార్పు కోరుకుంటున్నారనే సంకేతాలు ఈ ఎన్నికల్లో కనిపించాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు బలహీనంగా ఉండొచ్చు కానీ, ప్రతిపక్ష భావజాలం మాత్రం బలంగా ఉందన్న ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్య కూడా ఈ నేపథ్యంలో ప్రస్తావనీయమే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలు కేవలం విజయాలు, పరాజయాలను మాత్రమే సూచించవు. అవి ప్రజల మనోభావాలకు అద్దం పడతాయి. అందువల్ల ఉప ఎన్నికల ఫలితాలు, విద్యార్థి ఉద్యమాలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం సీరియస్‌గా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో సంస్కరణలు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, ధరల నియంత్రణ, పన్నుల భారాన్ని తగ్గించడం, సామాన్యులకు అందుబాటులో విద్యా, వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో వేగంగా చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయగలుగుతారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, కాలానుగుణంగా విధానాల్లో మార్పులు తీసుకురాగలిగినప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా దీర్ఘకాలికంగా ప్రజల మద్దతును నిలబెట్టుకోగలదనేది ప్రజాస్వామ్య చరిత్ర చెప్పే వాస్తవం.



# ఈ20 పెట్రోల్‌తో బహుళ ప్రయోజనాలు

- రైతులకు లాభం, దిగుమతులకు చెక్!
- కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో పర్యావరణ పరిరక్షణకు ఊతం
- పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టత!




**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఈ20 పెట్రోల్ పాలసీ అమలు, దాని వల్ల చేకూరే ప్రయోజనాలు, పాత వాహనాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని దశలవారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ నిర్ణయం వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థకు, రైతులకు మరియు పర్యావరణానికి బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయని కేంద్రం సమగ్రంగా వివరించింది. ఈ20 ఇంధన పాలసీ వల్ల ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటం తగ్గడంతో పాటు, ప్రతి ఏటా సుమారు 4 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతోందని మంత్రి వెల్లడించారు. అలాగే చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతోందని తెలిపారు. దీనికితోడు సాధారణ ఇంధనంతో పోలిస్తే ఈ20 వాడకం వల్ల కార్బన్ ఉద్గారాలు దాదాపు 30 శాతం వరకు తగ్గి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ20 మిశ్రమ ఇంధనంతో సురక్షితంగా నడుస్తున్నాయని కేంద్రం పేర్కొంది. పాత వాహనాల ఇంజిన్లపై లేదా వాటి విడిభాగాలపై దీనివల్ల ఎలాంటి తీవ్రమైన అసాధారణ అరుగుదల గానీ, పనితీరులో లోపాలు గానీ నమోదవలేదని పరిశోధనల్లో వెల్లడైందని మంత్రి ఉటంకించారు. నీతి ఆయోగ్, ఏఆర్ఏఐ, సియామ్ వంటి సాంకేతిక సంస్థలతో పాటు వాహన తయారీదారులతో సమగ్రంగా సంప్రదించిన తర్వాతే ఈ పాలసీని శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం వివరించింది.




# విదేశాల్లో దాక్కున్న నేరస్థులపై ఉక్కుపాదం!

- 2019 నుంచి 36 దేశాల నుంచి 274 మంది నిందితులను రప్పించిన కేంద్రం
- రూ.17,874 కోట్ల ఆస్తుల జప్తు.. రూ.18,762 కోట్ల నిధుల రికవరీ
- ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులపై కఠిన చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** విదేశాలకు పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. 2019 నుంచి 2026 మధ్యకాలంలో ప్రపంచంలోని 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు రప్పించినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. వీరిలో ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులు, మత్తుపదార్థాల అక్రమ రవాణాదారులతో పాటు హత్య, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు ఎదుర్కొంటున్న నిందితులు కూడా ఉన్నట్లు తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అత్యాధునిక సాంకేతికత, సమగ్ర నిఘా వ్యవస్థ, అంతర్జాతీయ సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. నేరస్థులను స్వదేశానికి రప్పించడమే కాకుండా, వారి అక్రమ ఆస్తులపై కూడా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 2019-2026 మధ్యకాలంలో పరారీలో ఉన్న నిందితులకు చెందిన రూ.17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు వెల్లడించింది. అలాగే ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యక్తులకు సంబంధించిన కేసుల్లో రూ.18,762 కోట్ల నిధులను తిరిగి రికవరీ చేసినట్లు తెలిపింది. విదేశాల్లో తలదాచుకున్న నేరస్థుల వేటలో భాగంగా అంతర్జాతీయ పోలీసు సంస్థ ఇంటర్‌పోల్ సహకారాన్ని కూడా భారత్ మరింత విస్తరించింది. ఈ క్రమంలో గడిచిన మూడేళ్లలోనే 501 రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. పరారీలో ఉన్న నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడమే కాకుండా, వారి అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ద్వారా నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగిస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# ఒప్పందమా.. లొంగుబాటా!

**ఇరాన్‌కు ట్రంప్ తుది హెచ్చరిక**
**చర్చలకు రాకుంటే కఠిన చర్యలేనన్న అమెరికా అధ్యక్షుడు**
**టెహ్రాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయ వ్యూహాలపై దృష్టి**
**హోర్ముజ్ జలసంధిపై అమెరికా ఆధిపత్యమంటూ సంచలన వ్యాఖ్యలు**



**వాషింగ్టన్, ఆగస్టు 4:** ఇరాన్ అణు కార్యక్రమం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టెహ్రాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. అమెరికాతో అణు ఒప్పందానికి అంగీకరించాలని, లేకపోతే పూర్తిగా లొంగిపోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇరాన్ చర్చలకు సిద్ధమని గతంలో సంకేతాలు ఇచ్చి, ఇప్పుడు బహిరంగంగా వెనక్కి తగ్గుతోందని ట్రంప్ ఆరోపించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న అణు సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతున్నామని, అయితే ఇరాన్ మాత్రం మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగుతోందని ఇరాన్ చెబుతున్నా, వాస్తవానికి అక్కడ అమెరికాదే పూర్తి ఆధిపత్యమని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు అమెరికా నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయని, ఇరాన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌పై మరింత ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణను సిద్ధం చేయాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తన సైనిక విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. టెహ్రాన్‌ను చర్చల బల్లపైకి తీసుకురావడానికి కొత్త వ్యూహాలు, సంప్రదాయేతర చర్యలపై సూచనలు ఇవ్వాలని సైనికాధికారులను కోరినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. ఇప్పటివరకు అమలు చేసిన వ్యూహాలను సమీక్షిస్తూ, అవసరమైతే మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత వారం ఇరాన్‌పై భారీ సైనిక దాడులు చేపడతామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, ఇతర గల్ఫ్ దేశాల విజ్ఞప్తితో ఆ చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దౌత్యపరమైన ప్రయత్నాలకు చివరి అవకాశం ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని ఇరాన్ వినియోగించుకోకపోతే మరింత కఠిన నిర్ణయాలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు, కువైట్, ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన డ్రోన్లు దాడులకు పాల్పడినట్లు సమాచారం. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ఇరాన్‌ను చర్చలకు ఒప్పించే ప్రయత్నాలతోపాటు అవసరమైతే కఠిన సైనిక చర్యలకు కూడా అమెరికా సిద్ధమవుతోందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నీట్ ఉద్యమం మళ్లీ భగ్గుమంది!

- బిహార్‌లో విద్యార్థుల మరోసారి భారీ ఆందోళన
- అరెస్టయిన విద్యార్థుల విడుదల హామీ అమలు కాలేదని ఆరోపణ
- ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి యత్నం..
- వాటర్ కేనన్లతో చెదరగొట్టిన పోలీసులు





**పట్నా, ఆగస్టు 4:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై బిహార్‌లో విద్యార్థుల ఆందోళనలు మరోసారి ఉద్ధృతమయ్యాయి. గత నెలలో జరిగిన నిరసనల సందర్భంగా అరెస్టయిన విద్యార్థులను విడుదల చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపిస్తూ వందలాది మంది విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలు మంగళవారం పట్నాలో నిరసనకు దిగారు. గాంధీ మైదాన్ నుంచి ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నివాసానికి ర్యాలీగా బయల్దేరిన ఆందోళనకారులను ఇన్‌కమ్ ట్యాక్స్ చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి నివాసానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే వారిని నిలువరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు ముందుకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, నిషేధిత ప్రాంతంలోకి చొచ్చుకెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించడంతోనే వాటర్ కేనన్లు వినియోగించాల్సి వచ్చిందని తెలిపారు. గత నెలలో కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన బంద్ సందర్భంగా సుమారు 600 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో సగం మందిని మైనర్లుగా గుర్తించి విడుదల చేయగా, మిగిలిన వారిని జైలుకు తరలించారు. ఆ తర్వాత కేసులను ఉపసంహరించుకుంటామని రాష్ట్ర హోంశాఖ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎంతమంది విద్యార్థులను విడుదల చేశారో, ఇంకా ఎంతమంది జైలులో ఉన్నారో అధికారిక జాబితా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలకు స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్, బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ మద్దతు ప్రకటించారు. దీంతో నీట్ పేపర్ లీక్ వ్యవహారం బిహార్ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# నేడు కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేలా, మండలంలో పార్టీ బలోపేతానికి ఈ నూతన కార్యాలయం వేదిక నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలుఅధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి





**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు పాటుపడాలని సిర్పూర్ కాగజ్నగర్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎ.అప్పయ్య అన్నారు. ఎన్ఎస్ఎస్, ఈకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవం సందర్భంగా మొక్కల నాటే కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కల పెంపకం, అటవీ సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ వనమహోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనతో పాటు బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. కళాశాల ఆవరణను మరింత హరితవనంగా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్, ఈకో క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తుడూరు దత్తాత్రేయ, ఈకో క్లబ్ కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి వీరమల్ల, ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ, డీఆర్ఓ డి.హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనరసింహం, ఈ.శారద, డి.జనార్ధన్, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

### సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ఒకటో నంబర్ అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సుమలత హాజరై తల్లిపాలు తాగించే ప్రాముఖ్యత, బిడ్డ పుట్టి న గంటలోపే ముర్రుపాలు పట్టడం, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం పట్ల తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ఈనెల 1 నుంచి 7వ తేది వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భూమవ్వ, శ్రీలత, రాణి,అరుణ, సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి





- **అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, మూత్రశాలలు, వంటశాల మరియు పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన పౌష్టి క ఆహారాన్ని అందించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు విద్యార్థుల హాజరు పూర్తిస్థాయిలో ఉండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పాఠశాలకు తరచూ గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని తల్లిదండ్రులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పించిందని, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యా బోధన అందించాలని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులందరికీ ఈ నెల 15వ తేదీలోగా 2 జతల ఏకరూప దుస్తులు (యూనిఫారాలు) అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూ భారతి పోర్టల్ పై జూనియర్ అసిస్టెంట్లకు పూర్తి అవగాహన ఉండాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** రెవిన్యూ శాఖలోని జూనియర్ అసిస్టెంట్లు భూ భారతి పోర్టల్‌లో ఉన్న ప్రతి అంశంపైనా పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె హరిత స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల జూనియర్ అసిస్టెంట్లకు "భూ భారతి పోర్టల్" పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్లు కేవలం తహశీల్దార్ కార్యాలయాల్లోని ధరణి బాధ్యతలకే పరిమితం కాకుండా, భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశంపై పట్టు సాధించాలని ఆదేశించారు. కేవలం భూ భారతి ఆపరేటర్లపైనే ఆధారపడకుండా కార్యాలయ పనులతో పాటు పోర్టల్‌లోని పనులను స్వయంగా నిర్వహించాలన్నారు. భూసేకరణ, దరఖాస్తుల పరిష్కారం సహా ఏ పని అప్పగించినా సమర్థవంతంగా చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలోనే అన్ని సందేహాలను నివృత్తి చేసుకుని, విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూ భారతి కోఆర్డినేటర్ రాము, రవికాంత్, జిలాని, వివిధ మండలాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే లక్ష్యం.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- **మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్**
- **లైవ్‌లో సమస్యలు.. స్పాట్‌లోనే సొల్యూషన్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** పరిశుభ్రతే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మున్సిపాలిటీ పరిధిలో ముందుకు సాగుతున్నాం అని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. మంగళవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి వారు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. వార్డు పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలతో నేరుగా ముఖాముఖి మాట్లాడి, కాలనీలో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



### అడిగిన వెంటనే వీధి దీపాల ఏర్పాటు.. డ్రైనేజీల క్లీనింగ్

పర్యటన సందర్భంగా కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై లైవ్‌లోనే స్పందించిన బృందం స్పాట్‌లోనే సొల్యూషన్' చూపుతూ అక్కడికక్కడే వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా వార్డులోని డ్రైనేజీలను తక్షణమే శుభ్రం చేయించారు. కాలనీలోని మిగతా సమస్యలను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

### సాంఘిక సంక్షేమ వసతి గృహంలో తనిఖీలు

అనంతరం వార్డు పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని (హాస్టల్) అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి అక్కడ అందుతున్న వసతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను వెంటనే తొలగించి, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రామయ్య, సుధాకర్, బిఆర్ఎస్ నాయకుడు గుండా శ్యామ్, స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి అడుగులు

### సత్వర స్పందన తెలిపిన పాలకవర్గం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యకు త్వరలోనే తెర పడనుంది. ప్రతిరోజూ వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే వేలాది మంది మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందిని గుర్తించిన సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ తోపాటు పలువురు సామాజిక కర్తలు ఈ సమస్యను వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్ రెడ్డి, సర్పంచ్ ఏలేటి నీలిమ, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య తీవ్రతను గమనించిన సర్పంచ్, పాలకవర్గం వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించి, వారితో కలిసి స్వయంగా స్థలాన్ని పరిశీలించి మరుగుదొడ్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం వీలైనంత త్వరగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని పాలకవర్గం హామీ ఇస్తూ చర్యలు ప్రారంభించింది. స్థానిక ప్రజల దీర్ఘకాలిక సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వరమే స్పందించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భూ భారతి భూముల రీ-సర్వేపై గ్రామసభ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని నాగమల్యాల్ గ్రామపంచాయతీ పరిధిలో 'భూ భారతి' భూముల రీ-సర్వే కార్యక్రమంపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రజలకు భూముల రీ-సర్వే ప్రక్రియపై రెవెన్యూ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నందిని అమృత్, ఉప సర్పంచ్ గంగాధర్, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు హాజరయ్యారు. సభలో రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్తుల భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా రీ-సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ భూముల వివరాలను సరిచూసుకోవాలని, సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. భూముల హద్దులను నిర్ధారించడం, రికార్డులను సవరించడంతో భవిష్యత్తులో భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని రీ-సర్వే విధానంపై అధికారులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

# ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా సయ్యద్ రిజ్వాన్ ఏకగ్రీవ ఎన్నిక

**ఉద్యమ కెరటం,కెరమెరి:** కెరమెరి మండల నూతన ఉప సర్పంచుల ఫోరం కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం మండల నూతన అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్, ఉపాధ్యక్షుడిగా పతంగే లింబదాస్, ప్రధాన కార్యదర్శిగా సూర్యావంశీ పరమేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మొహార్లే మోహన్, కోశాధికారిగా వాగ్మరే శ్రీకాంత్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మడవి తుకారాం, బాంనే సాగర్, జాదవ్ దిలీప్, ఆత్రం బారికరావు, మొహార్లే రాందాస్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్ మాట్లాడుతూ మండలం లోని ఉప సర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌లకు ప్రభుత్వ పరంగా రావలసిన గుర్తింపు, అధికారాల సాధన కోసం ఫోరం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రజాప్రతినిధులు, వివిధ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అబ్దుల్ కలాం, పెందోర్ మోతిరాం, కెరమెరి సర్పంచ్



పెందోర్ ఆనందరావు, ఇందాపూర్ సర్పంచ్ బుచ్చయ్య, నాయకులు ఆత్రం రాము, షైక్ మున్ను, ఆడ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలి

## కేయు జేఏసీ నాయకుల డిమాండ్



**ఉద్యమ కెరటం, నర్సంపేట:** తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ, ప్రజా జీవితంలోనూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కేయు జేఏసీ నాయకులు కొనియాడారు. సుదర్శన్ రెడ్డి 5వ రోజు సంతాప కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం కేయు జేఏసీ చైర్మన్ డా. సాదు రాజేష్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కేయు పాలకమండలి సభ్యులు డా. చిర్రా రాజు, జేఏసీ నేత జోరిక రమేష్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు. నర్సంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి గారి పేరును నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన సేవలను గుర్తిస్తూ, కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం రూ. 10 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలన్నారు. వరంగల్‌లో ప్రతిపాదిత నూతన విమానాశ్రయానికి కూడా ఆయన పేరు పెట్టాలని, పాకాల చెరువు బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన సేవలకు శాశ్వత గుర్తింపునివ్వాలని కోరారు. ఈ డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం తక్షణమే స్పందించి, సానుకూల నిర్ణయం తీసుకుని అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా. ఫిరోజ్ పాషా, డా. వి. ఎస్. యాకుబ్ రెడ్డి, డా. నాగరాజు పటేల్, నలిగంటి శరత్, డా. భైరపాక ప్రశాంత్, లంక రాజగోపాల్, రామూర్తి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

## గర్భిణీలకు సీమంతాలు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్ అన్నారు. నర్సాపూర్ సెక్టార్ పరిధిలోని సాత్నంబర్ గ్రామంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్వైజర్ జాదవ్ విమల తల్లిపాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా లాంటిదని స్పష్టం చేశారు. పుట్టిన వెంటనే తేనె, నీరు వంటివి ఏవీ పట్టకూడదని, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే 'బాలమృతం' పిండిని రోజుకు వంద గ్రాముల చొప్పున తినిపించాలన్నారు. పిల్లలకు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలు పట్టిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడంతో శిశువుకే కాకుండా తల్లులకు కూడా ఎంతో ఆరోగ్యకరమని, గర్భకోశ వ్యాధులు, రొమ్ము క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని అన్నారు.



ఈ కార్యక్రమంలో నర్సాపూర్ అంగన్వాడి టీచర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీలో ఉండి ఉద్యమాలు ఎందుకు..?

- సిర్పూర్లో అదిత తీరు రాజకీయ చర్చకు దారి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అదిత ఇటీవల కార్మికులు, పోడు రైతుల సమస్యలపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, అదే పార్టీకి చెందిన జాతీయ నాయకురాలు ప్రజా సమస్యలపై ఉద్యమాల బాట పట్టడం వెనుక ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు, పోడు రైతుల ఇబ్బందులు వంటి అంశాల పరిష్కారానికి పార్టీ జాతీయ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటే త్వరితగతిన ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీ అధిష్ఠానంతో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలను ప్రస్తావించడం రాజకీయ చర్చకు దారితీసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల సిర్పూర్ నియోజకవర్గ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించిన అదిత, ప్రజా సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ పర్యటనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె భవిష్యత్ రాజకీయ లక్ష్యాల దృష్ట్యా ప్రజలకు మరింత చేరువ కావాలనే వ్యూహంలో భాగంగానే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా అనే చర్చ కూడా కొనసాగుతోంది. అయితే ఈ అంశాలపై అదిత, కాంగ్రెస్ పార్టీ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# జన్నారం అటవీ అధికారిని విధుల నుంచి తొలగించాలి

## తుడుం దెబ్బ నాయకుల డిమాండ్

**ఉద్యమ కెరటం, తాండూర్:** జన్నారం మండలంలో ఆదివాసీలపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న దౌర్జన్యాలపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే జన్నారం అటవీ పరిధి అధికారి లక్ష్మీనారాయణను విధుల నుంచి తక్షణమే తొలగించాలని, అటవీ శాఖ అధికారి శాంతరాంను ఉమ్మడి జిల్లా నుంచి వెంటనే బదిలీ చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తాండూర్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో తాండూర్ మండల తుడుందెబ్బ అధ్యక్షుడు యాపల సమ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మణికుమార్ మాట్లాడారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన అధికారులు వారిపైనే అన్యాయంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత ఆదివాసీలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే తుడుందెబ్బ ఆధ్వర్యంలో జన్నారంలో వేలాది మంది ఆదివాసీలతో తుడుం మోతలు, పచ్చ జెండాలతో భారీ శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు, ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పశుల ధర్మయ్య, కొలవార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు గొల్లిశెట్టి బాపు, నాయక్ పోడ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు జైనేని బాపు, టెకం జేష్, ఉరడి వెంకటేష్, సాయి ప్రమోద్, గోలేటి అనిల్ పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని రోల్ మామడ గ్రామ ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినిలు సాంప్రదాయ వస్త్రధారణతో తలపై బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింభించేలా సాగిన ఈ వేడుకలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు. చివరిగా విద్యార్థులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

# దేశ రూపు రేఖలు మార్చ గలిగే శక్తి కేవలం యువతకే ఉంది



**ఉద్యమ కెరటం, తాండూర్:** దేశ రూపు రేఖలు మార్చగలిగే శక్తి కేవలం యువతకే ఉందని మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మాదారం గ్రామపంచాయతీ లోని ప్రాథమిక పాఠశాలలో బాలల గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు పూర్తిగా పౌరులపైనే ఉందని, బాలల భవిష్యత్తును సక్రమమైన దారిలో పెట్టే బాధ్యత వారి తల్లిదండ్రులతో పాటు గురువులపై ఉందని తెలిపారు. బాలలందరూ క్రమ శిక్షణతో ఉండి తల్లిదండ్రులకు, విద్య నేర్పే గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉన్నత చదువులు చదివి మంచి స్థానంలో స్థిరపడి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యా ప్రమాణాల్లో ఎన్నో మార్పులను తీసుకువచ్చిందని, ప్రతి విద్యార్థికి ఆర్థికంగా చేయూతనందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, గోదల లక్ష్మి, కత్తెర్ల రవికుమార్, గుండేటి లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, మౌనిక, పంచాయతీ సెక్రెటరీ శ్రీవాణి , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐస్ క్రీమ్ లో ఈగ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల కేంద్రమైన ఐబీలోని బాలాజీ దేవనారాయణ స్వీట్ హౌస్ లో కొనుగోలు చేసిన ఐస్ క్రీమ్ లో ఈగ వచ్చిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కొమురంభీం జిల్లా గోలేటి గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి తన కుమారుడికి స్వీట్ హౌస్ లో శివశక్తి కంపెనీకి చెందిన చాకోబార్ ఐస్ క్రీమ్ కొనుగోలు చేశాడు. దాన్ని ఆ బాలుడు తింటుండగా మధ్యలో ఈగ బయట పడింది. దీంతో దుకాణదారుడిని తిరుపతి నిలదీయగా, ఐస్ క్రీమ్ తయారీ కంపెనీ వాళ్ళను అడుగుతామని, తాము లోపల చూసి విక్రయించం కదా అని సమాధానం ఇవ్వడంతో బాధితుడు ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా స్వీట్ హౌస్ నిర్వాహకులపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ ఎండి. ఫక్రుద్దీన్ అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పోషకాహారం, నిర్వహణ విధానంపై ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై గ్రామస్తులతో సమావేశమై రహదారుల అభివృద్ధి, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఉప సర్పంచ్ కొండలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మల్లెల్లి నరసింహాస్వామి, కాంగ్రెస్ నాయకులు కిన్నెర లాజర్, కిన్నెర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ని తిరుగులేని రాజకీయ శక్తి గా తీర్చి దిద్దడమే లక్ష్యం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** కాంగ్రెస్ పార్టీని తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చి దిద్దడమే లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్లు అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై మంగళవారం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధిష్ఠానం చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ ని మరింత బలోపేతం చేయడానికి పటిష్టమైన మండల కమిటీలను పారదర్శకంగా, వేగవంతంగా ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోందని, గుడిహత్నూర్ మండల కమిటీల ఎంపికను సమిష్టి భావంతో పూర్తి చేసి పార్టీ ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మండల కన్వీనర్ దౌలత్ అధ్యక్షత వహించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోకా గణేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, అంబకంటి అశోక్, సుధాకర్ గౌడ్, మల్యాల కరుణాకర్, అక్తర్ అలీ, బండి దేవదాస్, శ్రీధర్, యువజన కాంగ్రెస్ నాయకులు బద్దం పోతరెడ్డి, గుడాల అనీష్, శ్రీకర్ గౌడ్, మస్కే మాధవ్, నాగనాథ్ అప్ప, ససాని మాధవ్, బాలాజీ పటేల్, చిట్యాల గంగన్న, కరాడే బ్రహ్మానందం, చట్ల మహేందర్, ఊయికే అనసూయ, ఆత్రం సుశీల, ఆడే జైపాల్, ఉర్వతే రోహిత్, తోషం ఆరిఫ్, రహీం, గణపతి, అర్కా భారత్, కేశవరావు, కృష్ణ, రాయసిడాం జంగు, జయరామ్, దుబ్బాక నరేష్, కారాడే విష్ణు, బండారి సతీష్, మారుతి, సద్దాం, సంజీవ్, మౌలానాతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూత్నంగా తల్లిపాల వారోత్సవాలు



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి:** సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట సెక్టార్ పరిధిలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను వినూత్నంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ షేక్ రహిమతున్నిసా ఆధ్వర్యంలో అయ్యగారిపేట 3వ కేంద్రం, జవహర్నగర్ కేంద్రం సహకారంతో, సూపర్వైజర్ యు.మహాలక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణీలకు సాధారణ ప్రసవం కోసం చేయాల్సిన వ్యాయామాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు గర్భిణిలకు ప్రత్యక్షంగా వ్యాయామాలు చేసి చూపిస్తూ, కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా బ్రీతింగ్ ఎక్సర్సైజ్లను ఆచరణలో చేసి చూపించారు. గర్భధారణ చివరి దశలో ప్రతిరోజూ శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయడం ద్వారా ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చని తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఈ వ్యాయామాలు ఎంతో ఉపయోగపడతాయని సూచించారు. అనంతరం తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలతో చిన్నారులను అనారోగ్యాల నుంచి కాపాడండి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీపాటి స్వాతి, కమల, హెల్పర్ కనకదుర్గ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు, విద్యార్థినులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్ట ర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఈ నెల 9వ తేదీన జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి ఆదివాసి గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, అధికారులతో కలిసి ఈ నెల 9వ తేదీన నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, 9 తెగల ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, రాయి సెంటర్ మెడీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. వేడుకలలో ఆదివాసీ 9 తెగల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. వేడుకలలో పాల్గొనే వారికి త్రాగునీరు, భోజన వసతి ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు ఐకమత్యంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. వేడుకల నిర్వహణకు తన వంతు సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, ఆదివాసి సంఘాల ప్రతినిధులు సిడాం అర్జు, బుర్స పోచయ్య, కుర్సింగ మోతిరామ్, మడావి నర్సింగ్ రావు, చాహకటి దస్రు, కొడప విశ్వేశ్వర్, 9 తెగల ఆదివాసి సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- **రిమ్స్, జీసీసీ గోదాములను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ మంద మకరందు**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్లోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న గిరిజన రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. వార్డుల్లో నిర్వహిస్తున్న గిరిజన రోగుల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగుల నమోదు, చికిత్స వివరాలు, మందుల పంపిణీ, వైద్య సేవల పురోగతిని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోగి పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆదిలాబాద్లోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గోదాములను సందర్శించి అటవీ ఉత్పత్తులు, ఇతర వస్తువుల నిల్వ విధానం, స్టాక్ రిజిస్టర్ల భద్రతా ఏర్పాట్లు, గోదాముల నిర్వహణను తనిఖీ చేశారు. నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కుడిమేత మనోహర్, రిమ్స్ వైద్యులు, గిరిజన సహకార సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యకు ప్రభుత్వం పెద్దపీట

## జిల్లా అదనపు కలెక్ట ర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా అదనపు కలెక్ట ర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య తెలిపారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారి, మున్సిపల్ చైర్పర్సన్, ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ముల్కలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల భద్రత దృష్ట్యా సమీప ప్రభుత్వ పాఠశాలకు తాత్కాలికంగా తరలించిన ఏర్పాట్లను సమీక్షించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తరలించిన పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యా బోధన నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి తరగతి గదులు, గ్రంథాలయం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, గ్రంథాలయ వినియోగం, క్రమబద్ధమైన బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో తహశీల్దార్తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ ఆర్థిక సహాయం, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా చూడాలని అన్నారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి ఓపీ నమోదు, ఔషధ నిల్వలు, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, టీకాల రికార్డులను పరిశీలించారు. మందుల లభ్యత, వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. దండేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ను కూడా సందర్శించి తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వంటశాల, భోజనశాల, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట సంబంధిత శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్ట ర్ రాములు



**ఉద్యమ కెరటం, తాండూర్:** జిల్లాలో పెండింగ్లో ఉన్న సీఎంఆర్, సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులు, రీ-సర్వే తదితర కార్యక్రమాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలోని కార్తికేయ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును రెవెన్యూ ఇన్స్పెక్టర్తో కలిసి పరిశీలించి సీఎంఆర్ బకాయిల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ సీఎంఆర్ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని మిల్లర్ లను ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్ఎల్ఆర్) ఎడితో కలిసి తాండూర్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పెండింగ్ సాదా బైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. రాంపూర్ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని తెలుసుకుని, త్వరగా ప్రక్రియను పూర్తిచేసి మరో 5 గ్రామాల్లో అదనంగా రీ-సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్లో ఉన్న వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి త్వరితగతిన జారీ చేయాలని, అన్ని పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ తహశీల్దార్ యు జ్యోత్స్న, డిప్యూటీ తహశీల్దార్ జె.కల్పన, ఆర్ఐ లు బి.పద్మజ, టి.మురళీధర్ రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యసన రహిత సమాజంతోనే తెలంగాణ రైజింగ్ సాధ్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆరోగ్యకరమైన యువతే తెలంగాణ రైజింగ్, వికసిత్ భారత్కు అసలైన బలమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్లోని బ్రహ్మకుమారీస్ నిలయంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అనంతరం దేశ వ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపట్టిన 10 కోట్ల మంది వ్యసన ముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలంటే కేవలం గంజాయి, కొకైన్ మాత్రమే కాదని, మద్యం, పొగాకు, జర్దా వంటి చిన్న అలవాట్లు కూడా తీవ్ర వ్యసనాలుగా మారి జీవితాన్ని నాశనం చేస్తాయని అన్నారు. ప్రస్తుత కాలంలో ఇన్స్టాగ్రామ్ రీల్స్, మొబైల్ ఫోన్ల అతిగా వాడకం వంటి డిజిటల్ వ్యసనాలు కూడా యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసం ప్రతిఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు ఉదయాన్నే లేవడం, యోగా, ధ్యానం వంటి దినచర్యలను అలవర్చుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యసన విముక్తిపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ ప్రతిజ్ఞా కార్యక్రమం రానున్న 15 రోజుల పాటు విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది అని అన్నారు. చెడు అలవాట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని, ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. ప్రస్తుత యువత వ్యసనాల బారిన పడి ఆవేశానికి, కోపానికి లోనవుతున్నారని, ఇది కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెద్దలను గౌరవిస్తూ, సంయమనంతో ప్రవర్తించాలని కోరారు. అనంతరం నశా ముక్త్ భరాత్ పోస్ట ర్లను ఆవిష్కరించారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డిఐఈఓ గణేష్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రామాయ్య, బ్రహ్మకుమారి నిర్వాహకులు రేవతి, దిల్ రెడ్డి, లెక్రాజ్, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# సంఘటన్ శ్రీజన్ అభియాన్తో కాంగ్రెస్కు కొత్త ఊపు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోథ్ నియోజకవర్గంలోని బోథ్, సొనాల, బజార్ హత్నూర్, గుడిహత్నూర్, తలమడుగు మండలాల్లో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్లతో పాటు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన మండల కమిటీల ఏర్పాటులో ఎలాంటి వర్గ విభేదాలకు తావు లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సామాజిక న్యాయం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ కమిటీలను రూపొందించాలని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోగా మండల కమిటీల నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి మండల కమిటీలో అధ్యక్షుడితో పాటు మొత్తం 21 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మహిళా నాయకులు, కార్యకర్తలకు కమిటీల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, బోథ్ మండల అధ్యక్షుడు మేరుగు భోజన్న,



సొనాల మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు కళ్లెం విఠల్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు దౌలత్, తలమడుగు మండల అధ్యక్షుడు కాస్లాల ప్రతాప్, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంఆర్పీ ముద్రించిన బేకరీ ఉత్పత్తు లు

**ఉద్యమ కెరటం ఎఫెక్ట్**




**ఉద్యమ కెరటం, జైనూర్:** ఉద్యమ కెరటం దినపత్రికలో ఎంఆర్పీ లేకుండా విక్రయిస్తున్న బేకరీ ఉత్పత్తులపై కథనం ప్రచురితమైన అనంతరం మార్పు కనిపించింది. గతంలో ఎంఆర్పీ లేకుండా విక్రయించిన "ఆర్కే క్వాలిటీ పావ్" ప్యాకెట్ల పై ఇప్పుడు రూ.12 ఎంఆర్పీ ముద్రించి మార్కెట్లో విక్రయిస్తున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో మీడియా పాత్ర మరోసారి స్పష్టమైందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై ఎంఆర్పీ, తయారీ తేదీ, గడువు తేదీ, తయారీదారు వివరాలు స్పష్టంగా ముద్రించి విక్రయించాలని వినియోగదారులు


ఉద్యమ కెరటం
ఎమ్మార్పీ చెరిపి ఆహార పదార్థాల విక్రయం?

కోరుతున్నారు. ప్రజా సమస్యలపై 'ఉద్యమ కెరటం' కథనాల ప్రభావంతో మార్పు సాధ్యమైందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు కృషి

**ఉద్యమ కెరటం, జైనూర్:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కొడప ప్రకాష్ అన్నారు. జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మోమిన్పూర కాలనీలో మంగళవారం చేపట్టి నవీధి దీపాల ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రజలకు రాత్రి వేళల్లో వెలుతురు అందించి, భద్రతను పెంపొందించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తయ్యేలా సిబ్బందికి సూచనలు



చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రతి కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, వీధిదీపాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా పూర్తి చేసి జైనూర్ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కొంపల్లి క్రోమా యూ-టర్న్పై ట్రాఫిక్ డీసీపీ ఫోకస్

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్ :**

కొంపల్లిలోని క్రోమా జంక్షన్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త యూ-టర్న్ను మేడ్చల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఐపీఎస్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు, యూ-టర్న్ తీసుకునే వాహనాల కదలికలు, ట్రాఫిక్ ప్రవాహం, భద్రతా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, యూ-టర్న్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేలా అవసరమైన మార్పులు చేపట్టాలని ఆదేశించారు. వాహనదారులు సులభంగా, వేగంగా, సురక్షితంగా ప్రయాణించేలా ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతిక, భౌతిక మార్పులు అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ప్రమాదాలను నివారించడం, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న కూడళ్ల ను గుర్తించి, అవసరమైన చోట్ల శాశ్వత పరిష్కారాలు అమలు చేసే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.కొంపల్లి క్రోమా యూ-టర్న్ వద్ద చేపట్టిన ఈ మార్పులు అమల్లోకి వస్తే ట్రాఫిక్ ప్రవాహం మరింత మెరుగుపడటంతో పాటు వాహనదారులకు సమయ పాలన, భద్రత పరంగా కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ ఏసిపి వై. వెంకటేశ్వర రావు , మేడ్చల్ ట్రాఫిక్ సీఐ కె. క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూ రు రోడ్డు ను జాతీయ రహదారితో అనుసంధానం చేయాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని కొత్తూరు రోడ్డును జాతీయ రహదారితో అనుసంధానం చేసి, రహదారికి అడ్డుగా నిర్మించిన గోడను వెంటనే తొలగించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టి ప్రజల రాకపోకలకు అనువుగా మార్చాలని పేర్కొన్నారు. హైవేతో అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రహదారికి అడ్డుగా నిర్మించిన గోడ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గోడను తొలగించాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొలికపోగు సర్వేశ్వరరావు, జాజిరి జ్యోతి, రావుల రాజబాబు, చావ రమేష్, బండి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం

## ఈనెల 15లోగా మండల, గ్రామ కమిటీల ఏర్పాటు




**ఉద్యమ కెరటం, సొనాల:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సొనాల మండల కేంద్రంలో మంగళవారం విస్తృత సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మండల కమిటీల ఏర్పాటు, పార్టీ సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షుడితో కలిపి మొత్తం 21 మంది సభ్యులు ఉండాలని, అందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ కమిటీల్లో మహిళా నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల అనుభవాన్ని పార్టీ అభివృద్ధికి, వినియోగించుకునేలా ప్రతి మండలంలో ప్రత్యేకంగా పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను ఈనెల 15లోగా పూర్తి చేయాలని అన్నారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తించి తగిన గౌరవం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి , బోథ్ ఆత్మ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పీఏసీ మెంబర్ బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, బుపెల్లి శ్రీధర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం పోత రెడ్డి, ఉపాధ్యక్షుడు అనీష్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మల్యాల కరుణాకర్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీలు అక్తర్ అలీ, బండి దేవదాస్ చారి, లక్ష్మా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ బద్దం పురుషోత్తం రెడ్డి, కడే సంతోష్, మండల అధ్యక్షులు గాజుల పోతన్న, కుమార్, జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీలు లోలపు పోశెట్టి, హరి సింగ్, బోథ్ మార్కెట్ డైరెక్టర్లుజుంగల భోజన్న, సోమన్న, సొనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వినోద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అనిల్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడాల శేఖర్, నరోత్తం రెడ్డి, సుదర్శన్, రవి, విజయ్ భాస్కర్ రెడ్డి, కసిరే పోతన్న, చెట్ల పల్లిఅశోక్, మద్దెల మహేష్, బోరిగాపు రాజారాం, మెహమూద్ ఖాన్, అమృత్ రావు పటేల్, సొనాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే సంజీవరెడ్డి .

**ఉద్యమ కెరటం, పెద్ద శంకరంపేట్:**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంజరుగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేట లోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణ. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్. మధు మురళి పంతులు. మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్లు గౌడ్. ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ప్రపంచ బ్యాడ్మింటన్‌కు రంగం సిద్ధం!



- బీడబ్ల్యూఎఫ్ సీడింగ్స్ విడుదల.. సింధుకు 9వ ర్యాంక్
- సాత్విక్-చిరాగ్ జోడీకి 5వ సీడింగ్
- ఆగస్టు 17 నుంచి 23 వరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించిన సీడింగ్స్‌ను ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య విడుదల చేసింది. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి. సింధు 9వ సీడ్‌ను దక్కించుకోగా, పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీకి 5వ సీడింగ్ లభించింది. ఆగస్టు 17 నుంచి 23 వరకు ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగే ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున ఐదు విభాగాల్లో రెండేసి ఎంట్రీలు ఉండగా, నాలుగు విభాగాల్లో కనీసం ఒక్కో సీడెడ్ క్రీడాకారుడు లేదా జోడీ చోటు దక్కించుకోవడం విశేషం. పురుషుల సింగిల్స్‌లో మాజీ ప్రపంచ కాంస్య పతక విజేత లక్ష్యసేన్ 14వ సీడ్‌గా నిలవగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంటకు 15వ సీడింగ్ లభించింది. టోర్నీ అధికారిక డ్రాను బుధవారం విడుదల చేయనున్నారు. పురుషుల సింగిల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్‌వన్ షీ యుకీ అగ్ర సీడ్‌గా బరిలోకి దిగుతుండగా, మహిళల సింగిల్స్‌లో దక్షిణ కొరియా స్టార్ అన్ సే యంగ్ టాప్ సీడ్‌గా నిలిచింది. మహిళల విభాగంలో జపాన్‌కు చెందిన అకానే యమగుచి రెండో సీడ్‌గా ఎంపిక కాగా, చైనాకు చెందిన వాంగ్ జీ యి, చెన్ యుఫెయ్ వరుసగా మూడో, నాలుగో సీడ్లు పొందారు. పురుషుల డబుల్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన కిమ్ వోన్ హో-సియో సెయుంగ్ జై జోడీ అగ్ర సీడ్‌గా బరిలోకి దిగుతోంది. ప్రపంచ స్థాయి పోటీల్లో భారత షట్లర్లు సీడింగ్స్‌కు తగ్గట్టుగా రాణించి పతకాలతో మెరవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# 15 ఏళ్ల రూమర్లకు బ్రెట్ లీ ఫుల్‌స్టాప్!

**ప్రీతి జింటాతో ప్రేమ వ్యవహారం లేదని స్పష్టీకరణ**

**మా మధ్య ఉన్నది కేవలం స్నేహమేనన్న ఆస్ట్రేలియా మాజీ పేసర్**

**వైరల్ ప్రచారాలపై మరోసారి స్పందించిన బ్రెట్ లీ**

**ముంబై, ఆగస్టు 4 :** ఆస్ట్రేలియా మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ, బాలీవుడ్ నటి ప్రీతి జింటాతో తనకు ప్రేమ వ్యవహారం ఉందంటూ గతంలో ప్రచారంలోకి వచ్చిన వార్తలపై మరోసారి స్పందించారు. దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించుతూ, తమ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనని స్పష్టం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన బ్రెట్ లీ, తాను ఏ బాలీవుడ్ నటితోనూ డేటింగ్ చేయలేదని తేల్చిచెప్పారు. ప్రజలు తమకు నచ్చిన విధంగా ఊహాగానాలు సృష్టిస్తారని, కానీ అలాంటి వార్తలను తాను ఎప్పుడూ పట్టించుకోలేదని అన్నారు. నిజం తనకు తెలుసు కాబట్టి ఆ ప్రచారాలు తనపై ఎలాంటి ప్రభావం చూపలేదని పేర్కొన్నారు. ఐపీఎల్ ప్రారంభ సీజన్లలో బ్రెట్ లీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) తరఫున ఆడిన సమయంలో జట్టు సహ యజమాని ప్రీతి జింటాతో తరచూ కనిపించడంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనే వార్తలు అప్పట్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఆ వార్తలను ఇప్పుడు మరోసారి ఖండించిన బ్రెట్ లీ, ప్రీతి జింటా భారతదేశంలో తనకు అత్యంత సన్నిహిత స్నేహితుల్లో ఒకరని చెప్పారు. ఆమె ఎంతో తెలివైన వ్యక్తి అని, ఆమెపై తనకు అపారమైన గౌరవం ఉందని వెల్లడించారు. గతంలో 2011లో కూడా ఇదే అంశంపై స్పందించిన బ్రెట్ లీ, తమ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనని చెప్పగా, 2010లో ప్రీతి జింటా కూడా సోషల్ మీడియా వేదికగా ఈ ప్రచారాలను ఖండించారు. తాను ఏ క్రికెటర్‌తోనూ ప్రేమలో లేనని, అలాంటి విషయం ఉంటే తానే వెల్లడిస్తానని ఆమె అప్పట్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రీతి జింటా తన భర్త జీన్ గూడెనఫ్‌తో కలిసి కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. 2016లో వీరిద్దరూ వివాహం చేసుకోగా, 2021లో సరోగసీ ద్వారా కవలలకు తల్లిదండ్రులయ్యారు. మరోవైపు బ్రెట్ లీ 2015లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం వ్యాఖ్యాతగా, క్రికెట్ విశ్లేషకుడిగా కొనసాగుతున్నారు.

# టీమిండియాకు ఇద్దరు కోచ్‌ల గుడ్‌బై!




**రియాన్ టెన్ డస్చేట్, టీ. దిలీప్‌కు బీసీసీఐ కృతజ్ఞతలు**

**కాంట్రాక్టు ముగియడంతో సేవలకు ముగింపు**

**తదుపరి బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్ష**

**ముంబై, ఆగస్టు 5:** భారత క్రికెట్ జట్టుకు సేవలందించిన అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్చేట్, ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్‌లకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వీడ్కోలు పలికింది. కాంట్రాక్టు గడువు ముగియడంతో ఇద్దరి ఒప్పందాలను పొడిగించకుండా, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్ బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించింది. శ్రీలంక పర్యటనకు భారత జట్టు బయలుదేరిన సందర్భంగా బీసీసీఐ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేసింది. భారత జట్టు విజయాల్లో రియాన్ టెన్ డస్చేట్, టీ. దిలీప్ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం, నిరంతర శ్రమ కీలక పాత్ర పోషించాయని కొనియాడింది. వారి భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల మేరకు భారత జట్టులో చేరిన రియాన్ టెన్ డస్చేట్, ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల అనంతరం తన రాజీనామా సమర్పించగా, బీసీసీఐ దానిని ఆమోదించినట్లు సమాచారం. మరోవైపు ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్ కాంట్రాక్టు కూడా ముగియడంతో ఆయన సేవలకు కూడా బీసీసీఐ ముగింపు పలికింది. దీంతో భారత జట్టుతో ఈ ఇద్దరు సహాయక కోచ్‌ల అనుబంధం అధికారికంగా ముగిసింది. కొత్త కోచింగ్ బృందంపై బీసీసీఐ త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.




# యూఏఈ వేదికగా మహిళల టీ20 ఆసియా కప్

**ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు టోర్నీ నిర్వహణకు సన్నాహాలు**

**భారత్-పాకిస్థాన్ పోరుపై అభిమానుల్లో భారీ ఆసక్తి**

**షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్**

**దుబాయ్, ఆగస్టు 5:** మహిళల టీ20 ప్రపంచకప్ విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి రంగం సిద్ధమవుతోంది. మహిళల టీ20 ఆసియా కప్-2026ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా నిర్వహించేందుకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సన్నాహాలు చేస్తున్నట్లు క్రీడా వర్గాలు వెల్లడించాయి. ఈ టోర్నీ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. టోర్నీ తేదీలను ఏసీసీ ఇప్పటికే సభ్య దేశాలకు అంతర్గతంగా తెలియజేసినట్లు తెలుస్తోంది. అయితే మ్యాచ్‌ల షెడ్యూల్, వేదికల వివరాలను అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. పరిపాలనా అనుమతులు, వేదికల ఖరారు ప్రక్రియ పూర్తయిన వెంటనే పూర్తి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మలేసియా, థాయ్‌లాండ్, యూఏఈ జట్లు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. దీంతో మరోసారి భారత్-పాకిస్థాన్ మహిళల మ్యాచ్‌పై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడతాయన్నది షెడ్యూల్ విడుదల తర్వాత స్పష్టత రానుంది. సభ్య దేశాలకు పంపిన సమాచార ప్రకారం అన్ని జట్లు ఆగస్టు 27న యూఏఈ చేరుకోనున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. మహిళల టీ20 ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్ పూర్తి ఆధిపత్యం చాటింది. టీమిండియా ఏడు సార్లు టైటిల్‌ను కైవసం చేసుకోగా, 2024లో జరిగిన గత టోర్నీ ఫైనల్లో శ్రీలంక చేతిలో ఓటమి చవిచూసింది. ఈసారి టైటిల్‌ను తిరిగి దక్కించుకోవాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగనుంది.



# షమీకి మరోసారి షాక్!

**శ్రీలంక టెస్టు సిరీస్‌కు యువ పేసర్ అకీబ్ నబీకి అవకాశం**

**ఫిట్‌నెస్, ఫామ్‌కే పెద్దపీట.. సెలెక్టర్ల స్పష్టమైన సంకేతాలు**

**టీమిండియాలో మహ్మద్ షమీ భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశ ఎదురైంది. గాయంతో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు దూరమైన జస్ప్రీత్ బుమ్రా స్థానంలో అనుభవజ్ఞుడైన షమీని కాకుండా జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీని ఎంపిక చేస్తూ బీసీసీఐ సెలెక్షన్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో షమీ భవిష్యత్తుపై సెలెక్టర్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మహ్మద్ షమీ చివరిసారిగా 2025లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, టెస్టు క్రికెట్‌లో 2023 తర్వాత ఆయనకు అవకాశం రాలేదు. వన్డేల్లో కూడా గత ఏడాది న్యూజిలాండ్ సిరీస్ తర్వాత జాతీయ జట్టుకు దూరంగా ఉన్నారు. గాయాల నుంచి కోలుకున్న అనంతరం దేశవాళీ క్రికెట్‌లో షమీ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ జాతీయ జట్టులోకి తిరిగి రాలేకపోయారు. ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో 37 వికెట్లు పడగొట్టి, 16.72 సగటుతో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించారు. 8/90తో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఫస్ట్‌క్లాస్ గణాంకాలు కూడా నమోదు చేశారు. అయితే అదే రంజీ సీజన్‌లో యువ పేసర్ అకీబ్ నబీ 60 వికెట్లు పడగొట్టి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 12.56 సగటుతో రాణించిన అతడికి శ్రీలంక టెస్టు సిరీస్‌కు అవకాశం దక్కింది. ఇటీవల షమీ పునరాగమనంపై స్పందించిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, టెస్టు క్రికెట్ ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ ప్రస్తుతం షమీ వద్ద లేదని పేర్కొన్నారు. దీంతో అనుభవం కంటే ఫిట్‌నెస్, దేశవాళీ ప్రదర్శనలకే సెలెక్టర్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విషయం స్పష్టమైంది. భవిష్యత్తులో టెస్టు జట్టులోకి తిరిగి రావాలంటే షమీ దులీప్ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణించడంతో పాటు పూర్తి ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువ పేసర్ల నుంచి తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో షమీ పునరాగమనం అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# షఫీక్ శతకంతో పాక్‌కు పైచేయి!

- వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం దిశగా పాకిస్థాన్
- 158 పరుగులతో అజేయంగా నిలిచిన అబ్దుల్ షఫీక్
- మరోసారి సెంచరీకి చేరువలోనే బాబర్ ఆజమ్ ఔట్

**ట్రినిడాడ్, ఆగస్టు 5:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో పట్టు బిగించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మెరుగైన స్థితిలో ఉన్న పాకిస్థాన్, మూడో రోజు కూడా అదే జోరు కొనసాగిస్తూ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే దిశగా అడుగులు వేసింది. ఓవర్‌నైట్ స్కోరు 266/2తో ఆట ప్రారంభించిన పాకిస్థాన్, కడపటి సమాచారం అందే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 381/7 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్ షఫీక్ అద్భుత బ్యాటింగ్‌తో 158 పరుగుల వద్ద అజేయంగా నిలిచి భారీ స్కోరు దిశగా సాగుతున్నాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ 88 పరుగులు చేసి మరోసారి సెంచరీకి చేరువలోనే ఔటయ్యాడు. దీంతో శతకం సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకున్నాడు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌట్ కావడంతో పాకిస్థాన్ ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే స్థితిలో నిలిచింది. అబ్దుల్ షఫీక్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌పై పాకిస్థాన్ పట్టు మరింత బలపడింది.



# రామాయణపై అనుమానాలు

### విడుదలకు ముందే చూపిస్తే మంచిది



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉ ండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్‌లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.



# డీప్‌ఫేక్ ఫోటోలపై మృణాల్ ఆగ్రహం

### తక్షణం తొలగించకపోతే చర్యలు

కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫొటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్ మార్ఫింగ్ ఫొటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా డీప్‌ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫొటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫొటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




# సల్మాన్ రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు

### మంచి సినిమా నిర్మించాలన్నదే లక్ష్యం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు. ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో కూడిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ కూడా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార కూడా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.

# నరకానికి నిదర్శనం మేషన్ కాలనీ!

# సీసీ రోడ్డు నిర్మించేదెప్పుడు?







**ఉద్యమ కెరటం, సిర్పూర్ (టి):** సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని మేషన్ కాలనీ నివాసులు తీవ్ర రవాణా ఇబ్బందులతో నరకయాతన అనుభవిస్తున్నారు. కాలాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఈ కాలనీ ప్రజల రవాణా కష్టాలు మాత్రం తీరడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం శూన్యంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అడుగడుగునా అవస్థలే.. గల్లీగా మారిన ప్రధాన రోడ్డు

ప్రస్తుతం మేషన్ కాలనీలో ఉన్న రహదారి పేరుకే దారి తప్ప, రాకపోకలకు మాత్రం ఏమాత్రం అనుకూలంగా లేదు. కాలక్రమేణా దారి ఆక్రమణలకు గురికావడం, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రధాన రహదారి కాస్తా చిన్న గల్లీగా మారిపోయింది. సాధారణ రోజుల్లోనే దెబ్బతిన్న రోడ్డుపై నడవడమే కష్టంగా ఉంటే, వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా తయారవుతోంది. మోకాళ్లలోతు బురదతో కాలనీ వీధులు బురద గుంటలను తలపిస్తున్నాయి.

### అత్యవసర వేళల్లో అంబులెన్స్ కూడా రాని పరిస్థితి

రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో కాలనీలోకి ఆటోలు, అత్యవసర సమయాల్లో రావాల్సిన అంబులెన్సులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అర్ధరాత్రి వేళల్లో ఎవరికైనా ఆరోగ్యం క్షీణించినా, గర్భిణులను లేదా వృద్ధులను ఆసుపత్రికి తరలించాల్సి వచ్చినా తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఆసుపత్రులకు తీసుకెళ్లే సరికే ప్రాణాలు మీదికి వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపై నిరసన.. కరవైన స్పందన

కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగిన వెడల్పు, పొడవుతో నాణ్యమైన సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామ పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో, వినతులకు స్పందించకపోవడానికి గల కారణాలేమిటో ప్రజలకు స్పష్టం చేయాలని కాలనీ నివాసులు డిమాండ్ చేస్తున్నారు.

### శాశ్వత పరిష్కారం చూపాలి

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి మేషన్ కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. తగిన కొలతలతో నాణ్యమైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ రవాణా కష్టాల నుంచి శాశ్వత విముక్తి కల్పించాలని గట్టిగా కోరుతున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**